

# వరల్డ్‌కప్ 2023

నేటి మ్యాచ్
ఇంగ్లండ్
X
శ్రీలంక
మ. 2.00 నుంచి
వేదిక: బెంగళూరు

## స్కీట్‌లో స్వర్ణం

న్యూఢిల్లీ: ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్‌లో భారత పురుషుల జట్టు పసిడి పతకం కైవసం చేసుకుంది. దక్షిణా కొరియాలో జరుగుతున్న పోటీల్లో అనంత్‌జీత్ సింగ్, అంగద్ వీర్‌సింగ్, గురుజ్యోత్‌తో కూడిన భారత జట్టు.. స్కీట్ టీమ్ ఈవెంట్‌లో అగ్రస్థానంలో నిలిచింది. బుధవారం జరిగిన ఫైనల్లో భారత జట్టు 358 పాయింట్లతో స్వర్ణం ఖాతాలో వేసుకుంది.

## కలిసి పనిచేస్తాం..

హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు



హైదరాబాద్, ఆట ప్రతినిధి: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ పాలక వర్గ సభ్యులందరం ఒకతాటిపై కలిసి పనిచేస్తామని అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు అన్నారు. బుధవారం ఉప్పల్ స్టేడియంలో ఆయన అధ్యక్ష బాధ్యతలు స్వీకరించారు. జగన్‌తో పాటు దల్జిత్‌సింగ్ (ఉపాధ్యక్షుడు), దేవరాజ్ (కార్యదర్శి), బసవరాజు(సహాయ కార్యదర్శి), శ్రీనివాస్‌రావు (కోశాధికారి), సునీల్ (కౌన్సిలర్)పదవులను అలకరించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు జగన్ మాట్లాడుతూ 'అనుభవజ్ఞులైన శివలాల్, అర్షద్, జాన్‌మనోజ్ అభిప్రాయలకు తోడు క్లబ్ కార్యదర్శుల ఆలోచనలకు అనుగుణంగా ముందుకెళ్తాం. క్రికెట్ అభివృద్ధికి ఆయా క్లబ్‌లు, జిల్లా అనుబంధ సంఘాల సహకారంతో అభివృద్ధికి కృషి చేస్తాం' అని అన్నారు.

## మహిళల జట్టు కోచ్‌గా మజుమ్‌దార్

ముంబై: దేశవాళీ దిగ్గజ ఆటగాడు అమోల్ మజుమ్‌దార్ భారత మహిళల క్రికెట్ జట్టు హెడ్‌కోచ్‌గా నియమితుడయ్యాడు. సులక్షణ నాయక్, అశోక్ మల్హోత్రా, జతిన్ పరాంజపేతో కూడిన క్రికెట్ సలహాదారుల కమిటీ (సీఏసీ) ఏకగ్రీవంగా మజుమ్‌దార్‌కు మద్దతు తెలిపింది. దీంతో బుధవారం బీసీసీఐ కొత్త కోచ్‌ను ప్రకటించింది. రంజీల్లో రెండు దశాబ్దాలకు పైగా ముంబైకి ప్రాతినిధ్యం వహించిన మజుమ్‌దార్ మహిళల క్రికెట్ జట్టును పటిష్టంగా తీర్చి దిద్దుతారనే నమ్మకముందని బోర్డు కార్యదర్శి జై షా ఆకాంక్షించాడు.



*గోవా వేదికగా జరుగుతున్న నేషనల్ గేమ్స్‌లో కాంస్య పతకం సాధించిన తెలంగాణ మహిళల నెట్‌బాల్ జట్టు. ఢిల్లీతో హోరాహోరీగా సాగిన పోరు 64-64తో టై గా ముగిసింది*

## గిల్ @ 2

దుబాయ్: వన్డే ప్రపంచకప్‌లో చక్కటి ప్రదర్శన కనబరుస్తున్న భారత యువ ఓపెనర్ శుభ్‌మన్ గిల్ ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానానికి చేరువయ్యాడు. పాకిస్థాన్ కెప్టెన్ బాబర్ ఆజమ్ 829 పాయింట్లతో టాప్‌లో ఉండగా.. గిల్ 823 పాయింట్లతో రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. శుభ్‌మన్‌తో పాటు టీమ్‌ఇండియా నుంచి కోహ్లీ (6), రోహిత్ (8) టాప్-10లో చోటు దక్కించుకున్నారు. బౌలర్ల జాబితాలో మహమ్మద్ సిరాజ్ రెండో ర్యాంక్‌కు చేరాడు.

## శ్రీకాంత్, లక్ష్య ఔట్

న్యూఢిల్లీ: ఫ్రెంచ్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ షట్లర్లు కిడాంబి శ్రీకాంత్, లక్ష్యసేన్‌కు చుక్కెదురైంది. బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ సూపర్-750 టోర్నీ పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో బుధవారం శ్రీకాంత్ 17-21, 15-21తో టోమా పాపొవ్ (ఫ్రాన్స్) చేతిలో ఓడగా.. లక్ష్యసేన్ 15-21, 18-21తో అర్నాడ్ మెర్కెల్ చేతిలో పరాజయం పాలయ్యాడు.



మ్యాక్స్‌వెల్
44 బంతుల్లో 106
9 ఫోర్లు
8 సిక్సర్లు



వార్నర్
(104)

### 309 పరుగుల తేడాతో నెదర్లాండ్స్ చిత్తు

# మ్యాక్స్ మోత

ఆస్ట్రేలియా రికార్డు విక్టరీ

మ్యాక్స్‌వెల్ సుడిగాలి సెంచరీ • వార్నర్ ఆరో శతకం

**ఎన్ని మ్యాచ్‌ల్లో విఫలమైనా.. తనపై ఐపీఎల్ ఫ్రాంచైజీలు కోట్లు ఎందుకు కుమ్మరిస్తాయో మ్యాక్స్‌వెల్ మరోసారి నిరూపించాడు. లెంగ్త్ బాల్‌కు స్ట్రయిట్ డ్రైవ్.. స్లోవర్ బాల్‌కు అప్పర్ కట్, ఆఫ్ స్టంప్ బయటి బంతికి రివర్స్ స్లాప్, నేరుగా వచ్చిన బంతికి స్విచ్ హిట్, కాస్త పక్కకు పోయిందంటే రివర్స్ స్వీప్ ఇలా క్రీజులో శివ తాండవమాడిన మ్యాక్సీ.. ప్రపంచకప్‌లో అత్యంత వేగవంతమైన శతకం తన పేరిట లిఖించుకుంటే.. విధ్వంసక ఓపెనర్ డేవిడ్ వార్నర్ మెగాటోర్నీలో ఆరో సెంచరీతో నయా రికార్డు నెలకొల్పాడు. కంగారూల ఊచకోత ముందు డచ్ బౌలర్లు తేలిపోగా.. లక్ష్యఛేదనలో ముందే చేతులెత్తేసిన డచ్..ఆసీస్ ఆధిపత్యానికి దాసోహం అంది. వరల్డ్‌కప్ చరిత్రలోనే అత్యంత భారీ విజయంతో కంగారూలు నాలుగో స్థానానికి దూసుకెళ్లారు.**

**1** వరల్డ్‌కప్‌లో పరుగుల పరంగా ఇదే అతిపెద్ద (309) జయం. ఓవరాల్‌గా ఆసీస్‌కు ఇదే అత్యుత్తమం.

**1** వన్డే ప్రపంచకప్‌లో అతి తక్కువ బంతుల్లో (40) సెంచరీ చేసిన ప్లేయర్‌గా మ్యాక్స్‌వెల్ రికార్డుల్లోకెక్కాడు. మార్క్‌రమ్ (49 బంతుల్లో) రెండో స్థానంలో ఉన్నాడు.

**1** వన్డే క్రికెట్ చరిత్రలో అత్యధిక పరుగులు (115) సమర్పించుకున్న బౌలర్‌గా బాస్ డీ లీడ్ నిలిచాడు.

న్యూఢిల్లీ: ఆస్ట్రేలియా జూలు విదిల్చింది. వన్డే ప్రపంచకప్‌లో భాగంగా ఆడిన తొలి రెండు మ్యాచ్‌ల్లో పరాజయాలు ఎదుర్కొన్న ఆసీస్ ఆ తర్వాత వరుసగా మూడో విజయంతో 'హ్యాట్రిక్' నమోదు చేసుకుంది. బుధవారం జరిగిన పోరులో ఆస్ట్రేలియా రికార్డు స్థాయిలో 309 పరుగుల తేడాతో నెదర్లాండ్స్‌ను మట్టికరిపించింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న ఆసీస్ నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 399 పరుగులు చేసింది. స్పిన్ ఆల్‌రౌండర్ గ్లెన్ మ్యాక్స్‌వెల్ (44 బంతుల్లో 106; 9 ఫోర్లు, 8 సిక్సర్లు) సుడిగాలి సెంచరీతో చెలరేగితే.. డేవిడ్ వార్నర్ (93 బంతుల్లో 104; 11 ఫోర్లు, 3 సిక్సర్లు) రికార్డు సెంచరీ తన పేరిట లిఖించుకున్నాడు. మాజీ కెప్టెన్ స్టీవ్ స్మిత్ (71; 9 ఫోర్లు, ఒక సిక్సర్), లబుషేన్ (47 బంతుల్లో 62; 7 ఫోర్లు, 2 సిక్సర్లు) అర్ధశతకాలతో మెరిశారు. నెదర్లాండ్స్ బౌలర్లలో వాన్ బీక్ 4, బాస్ డీ లీడ్ రెండు వికెట్లు పడగొట్టారు. ఒకదశలో 267/5తో ఉన్న ఆసీస్ అంత భారీ స్కోరు చేస్తుందని ఎవరూ ఊహించి ఉండరు. అయితే చివరి 10 ఓవర్లలో మ్యాక్స్‌వెల్ విధ్వంసకాండ రచించడంతో ఆ జట్టు 131 పరుగులు ఖాతాలో వేసుకుంది. అనంతరం కొండంత లక్ష్యఛేదనలో డచ్ జట్టు 21 ఓవర్లలో 90 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ విక్రమ్‌జీత్ సింగ్ (25) టాప్ స్కోరర్ కాగా.. తక్కినవాళ్లంతా విఫలమయ్యారు. ఆసీస్ బౌలర్లలో జాంపా 4, మిషెల్ మార్ష్ రెండు వికెట్లు తీశారు. మ్యాక్స్‌వెల్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.

### ఇది క్రికెటేనా!

*ఔట్ సైడ్ ఆఫ్ స్టంప్ షార్ట్ బాల్ దొరికితే మరే ప్లేయర్ అయినా.. పాయింట్ మీదుగా కట్ చేసి పరుగులు రాబడతాడు.. కానీ మ్యాక్స్‌వెల్ లాంటి ముదురు మాత్రం దానికి రివర్స్ స్లాపింగ్‌తో బ్యాక్‌వర్డ్ పాయింట్ దిశగా ప్రేక్షకుల్లో పడేశాడు. ఈ ఒక్క షాట్ అనే కాదు. అసలు రివర్స్ స్వీప్ ఏదో, స్విచ్ హిట్ ఏదో అని ఆలోచించుకునే లోపే మరో పిడుగు లాంటి షాట్.. దాన్ని ఆస్వాదిద్దామనుకునేసరికి మెరుపులాంటి మరో షాట్.. ఇలా ఢిల్లీలో డచ్ బౌలర్లకు పట్టపగలే చుక్కలు చూపిన మ్యాక్స్‌వెల్ వన్డే ప్రపంచకప్‌లో తన పేరును సువర్ణాక్షరాలతో లిఖించుకున్నాడు. సాధారణంగా ఒక మంచి ఇన్నింగ్స్ నమోదైతే.. దాని గురించి చదివినా చూసినట్లే అనిపిస్తుంది. కానీ, మ్యాక్సీ దంచుడు మాత్రం దానికి పూర్తిగా భిన్నం! ఏబీ డివిలియర్స్ పూనినట్లు, తనకు మాత్రమే సాధ్యం అన్నట్లు.. అతడు బాదిన బాదుడు చూసి తీరాల్సిందే!!*

### సంక్షిప్త స్కోర్లు

ఆస్ట్రేలియా: 399/8 (మ్యాక్స్‌వెల్ 106, వార్నర్ 104; వాన్ బీక్ 4/74), నెదర్లాండ్స్: 21 ఓవర్లలో 90 ఆలౌట్ (విక్రమ్ 25; జాంపా 4/8, మార్ష్ 2/19).

### ప్రపంచ కప్ పాయింట్ల పట్టిక

| దే | ఆ | గె | ఓ | ర.రే. | పా |
|---|---|---|---|---|---|
| భారత్ | 5 | 5 | 0 | +1.35 | 10 |
| దక్షిణాఫ్రికా | 5 | 4 | 1 | +2.37 | 8 |
| న్యూజిలాండ్ | 5 | 4 | 1 | +1.48 | 8 |
| ఆస్ట్రేలియా | 5 | 3 | 2 | +1.14 | 6 |
| పాకిస్థాన్ | 5 | 2 | 3 | -0.40 | 4 |
| అఫ్గానిస్థాన్ | 5 | 2 | 3 | -0.96 | 4 |
| శ్రీలంక | 4 | 1 | 3 | -1.04 | 2 |
| ఇంగ్లండ్ | 4 | 1 | 3 | -1.24 | 2 |
| బంగ్లాదేశ్ | 5 | 1 | 4 | -0.25 | 2 |
| నెదర్లాండ్స్ | 5 | 1 | 4 | -1.90 | 2 |

నోట్: దే: దేశం, ఆ: ఆడినవి, గె: గెలిచినవి, ఓ: ఓడినవి, ర: రన్‌రేట్, పా: పాయింట్స్

**1** ఆస్ట్రేలియా తరఫున వన్డే క్రికెట్‌లో వేగవంతమైన సెంచరీ చేసిన ప్లేయర్‌గానూ మ్యాక్స్ చరిత్ర లిఖించాడు.

వన్డే ప్రపంచకప్‌లో అత్యధిక సెంచరీలు చేసిన జాబితాలో వార్నర్ (6) రెండో స్థానానికి చేరాడు. ఈ మ్యాచ్‌లో శతకం ద్వారా సచిన్ టెండూల్కర్ (6) సరసన నిలిచాడు. రోహిత్ (7) అగ్రస్థానంలో ఉండగా.. ఆసీస్ తరఫున వార్నర్ టాప్‌కు చేరాడు. పాంటింగ్ (5) రెండో ప్లేస్‌లో ఉన్నాడు.

**2** వరల్డ్‌కప్‌లో ఆస్ట్రేలియా జట్టు తరఫున ఒకే మ్యాచ్‌లో ఇద్దరు బ్యాటర్లు సెంచరీలు చేయడం ఇది రెండోసారి. ఈ రెండూ తాజా ప్రపంచకప్‌లోనే నమోదయ్యాయి. పాకిస్థాన్‌తో పోరులో వార్నర్, మార్ష్ శతక్కొట్టగా.. ఈసారి వార్నర్, మ్యాక్స్‌వెల్ ఆ బాధ్యత తీసుకున్నారు

## హైదరాబాద్ పాంచ్ పటాకా

హైదరాబాద్, ఆటప్రతినిధి: సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ టీ20 టోర్నీలో హైదరాబాద్ ఐదో విజయం నమోదు చేసుకుంది. బుధవారం జరిగిన పోరులో హైదరాబాద్ 23 పరుగుల తేడాతో ముంబైని చిత్తుచేసింది. మొదట హైదరాబాద్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 155 రన్స్ చేసింది. తన్మయ్ అగర్వాల్ (59), రాహుల్ సింగ్ (37) రాణించారు. లక్ష్య ఛేదనలో ముంబై 8 వికెట్లకు 132 పరుగులకే పరిమితమైంది. కెప్టెన్ రహానే (24), యశస్వి జైస్వాల్ (16), శివమ్ దూబే (2), సర్ఫరాజ్ ఖాన్ (2) విఫలమయ్యారు. మన బౌలర్లలో రవితేజకు 4 వికెట్లు దక్కాయి.




Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.